సాక్షి తిరుపతి

ఆదివారం । 8 । అక్టోబర్ । 2023



బెల్ ఇంజినీర్ల పరిశీలన

రేణిగుంట సీడబ్ల్యూసీ గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లను కలెక్టర్‌తో కలిసి బెల్ ఇంజినీర్లు పరిశీలించారు. - 8లో



మద్యం దొంగలు

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సిబ్బంది గుట్టుచప్పుడు కాకుండా అందినకాడికి అడ్డంగా దోచేస్తున్నారు. - 8లో



	గరిష్టం	కనిష్టం
తిరుపతి	35	25
చిత్తూరు	33	23
తిరుమల	30	21
గూడూరు	37	27
నగరి	34	25

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో శాశ్వత ఆధార్ కేంద్రం



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకుని మీ ఆధార్ కార్డులను తప్పులు లేకుండా సరిచేసుకోవాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం రాష్ట్ర విద్యాశాఖ వారి సహకారంతో ఐటీడీఏ వారు చేపడుతున్న ఆధార్ నమోదు కేంద్రాన్ని కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి శాశ్వత ఆధార్ కేంద్రాన్ని కలెక్టరేట్‌లో ప్రారంభించామని చెప్పారు. అంతేకాకుండా జిల్లాలో తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో ఒకటి, సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయం పరిధిలో రెండు, శ్రీకాళహస్తి ఆర్డీవో పరిధిలో ఒక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం ఫోన్ నంబర్ మార్పు చేసుకున్న వారికి కలెక్టర్ చేతులమీదుగా నవీకరించబడిన పత్రాన్ని అందజేశారు. నెల్లూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిణి మందరాణి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి సూర్యనారాయణ, డీఎల్‌డీవోలు సుశీలాదేవి, వాణి పాల్గొన్నారు.

కిట్ల పరిశీలన

తిరుపతి అర్బన్: ఆడుదాం–ఆంధ్రకు సంబంధించిన శ్యాంపిల్ కిట్లను శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సెట్విన్ సీఈఓ మురళీకృష్ణ మాట్లాడుతూ కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ ఈ ఐదు క్రీడలలో పోటీలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఆ మేరకు కిట్లు అన్ని సచివాలయాలకు పంపుతున్నట్లు తెలిపారు. సచివాలయం పరిధి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడలకు పంపనున్నట్టు పేర్కొన్నారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చీఫ్‌కోచ్ సయ్యద్‌సాహెబ్ పాల్గొన్నారు.

నిషేధిత వస్తువులపై ఉక్కు పాదం



తిరుపతి క్రైం: జిల్లాలో నిషేధిత వస్తువులపై ఉక్కు పాదం మోపాలని జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రాజేంద్ర అధికారులను ఆదేశించారు. శనివారం పోలీస్ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ క్రైమ్ రివ్యూలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కడా నాటు సారాయి తయారుకాకుండా చూడాలన్నారు. గంజాయి అక్రమ రవాణా చేసే వారిపై నిరంతరం నిఘా ఉంచాలని చెప్పారు. యువత మత్తుకు బానిస కాకుండా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

ఆరోగ్య జీవనం!

'ఆరోగ్యకరమైన పంటలు పండించాలి.. ప్రజల ఆయురారోగ్యాలు కాపాడాలి.. వాతావరణ కాలుష్యాన్ని నివారించాలి.. పుడమి తల్లి క్షోభకు గురికాకుండా రక్షించాలి.. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి. తడిసిమోపెడవుతున్న పంట పెట్టుబడి భారం నుంచి రైతుకు విముక్తి కలగాలి..' అన్న లక్ష్యంతో సైంటిస్టులు తీవ్రంగా కృషిచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో తిరుపతిలో ఆర్‌ఏఆర్‌ఎస్ పేరుతో జీవన ఎరువుల ఉత్పత్తి కేంద్రాన్ని ఆరంభించారు. ఆరోగ్యకరమైన పంట దిగుబడి ఇచ్చేలా ఎరువులు తయారుచేస్తూ ఆకట్టుకుంటున్నారు. వీటిని రైతులకు నరసమైన ధరకే విక్రయించి తమవంతు సహకారం అందిస్తున్నారు. ఇక్కడ ఎలాంటి ఎరువులు తయారు చేస్తారు.. వాటి ప్రయోజనాలేంటి?.. తదితరాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం..



జీవన ఎరువులను తయారు చేస్తున్న శాస్త్రవేత్తలు

- జీవన ఎరువులతో ఆహార పంటల సామర్థ్యం పెంపు
- సేంద్రియ, జీవన ఎరువుల వాడకంతోనే ఆరోగ్యం
- పలు రకాల జీవన ఎరువులను ఉత్పత్తి చేస్తున్న ఆర్‌ఏఆర్‌ఎస్
- రైతులకు అతి తక్కువ ధరకు విక్రయం
- దూర ప్రాంత రైతుల కోసం ప్రత్యేకంగా కార్గో, పార్సిల్ సర్వీసులు

తిరుపతి సిటీ: హరిత విప్లవం తర్వాత వ్యవసాయ రంగంలో పెనుమార్పులు సంభవించాయి. హైబ్రిడ్ వంగడాలు కుప్పలు తెప్పలుగా వచ్చిపడ్డాయి. అధిక దిగుబడి సాధించే క్రమంలో రసాయన ఎరువుల వాడకం అధికమైంది. దీంతో భూభౌతికత దెబ్బతిని నేల కాలుష్యం పెరిగింది. ప్రధానంగా ఆహార పంటలు కలుషితమై ఆరోగ్య సమస్యలతో మానవజీవన స్థాయి తగ్గుతోంది. ఈ నేపథ్యంలో ఆహార పంటలలో దుష్ప్రభావాన్ని అరికట్టి, అధిక దిగుబడి, ఆరోగ్యానికి సేంద్రియ ఎరువులలో ప్రధానమైన జీవన ఎరువులే శరణ్యమని వ్యవసాయ శాస్త్రవేత్తలు భావించారు. ఆ దిశగా వ్యవసాయ విశ్వవిద్యాలయాలు కృషి చేస్తున్నాయి. ఇందులో భాగంగా తిరుపతి ఆంగ్రూ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (ఆర్‌ఏఆర్‌ఎస్) జీవన ఎరువులను ఉత్పత్తి చేసి రైతులకు అందిస్తూ అండగా నిలుస్తోంది.

వాడకం ఇలా..

వ్యవసాయ పంటలకు 2లీటర్లు, తోట పంటలకు 3 లీటర్ల చొప్పున విత్తనాలు విత్తే సమయంలోనూ, విత్తిన 30 రోజుల తర్వాత రెండు దఫాలుగా వాడాల్సి ఉంటుంది. రైతులు 500 మి.లీ చొప్పున నత్రజని, ఫాస్పరస్, పొటాష్, ట్రైకోడెర్మ్, సూడోమోనస్ వంటి జీవన ఎరువులను శాస్త్రవేత్తల సూచనల మేరకు వాడవచ్చు.

ఆర్‌ఏఆర్‌ఎస్‌లో ప్రత్యేక జీవన ఎరువుల ఉత్పత్తి కేంద్రం

తిరుపతి ఆర్‌ఏఆర్‌ఎస్‌లో 2015లో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ కృషీ వికాస్ యోజన పథకం ద్వారా జీవన ఎరువుల ఉత్పత్తి కేంద్రాని ప్రారంభించింది. నాణ్యమైన జీవన ఎరువులను అతి తక్కువ ధరకు రైతాంగానికి అందించడమే ఈ కేంద్రం ప్రధాన లక్ష్యం. గత నాలుగేళ్లుగా ద్రవ, పొడి జీవన ఎరువులను ప్రత్యేక యంత్రాలైన ఫర్మెంటర్ల సహాయంతో తయారు చేస్తున్నారు. సహజ సిద్ధంగా నేల, వాతావరణంలోని పోషకాలను మొక్కలకు అందించే సూక్ష్మజీవుల సమూహమే ఈ జీవన ఎరువులు. ఈ కేంద్రంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రధానంగా అజోస్పైరిల్లం, ఫాస్ఫరస్ సాల్యూబ్ లైజింగ్ బ్యాక్టీరియా(పీఎస్‌బీ), పొటాషియం రిలీసింగ్ బ్యాక్టీరియా(కేఎస్‌బీ), ట్రైకోడర్మ్, సుడోమోనాస్ లాంటి జీవన ఎరువులు ద్రవ, పొడి రూపాలలో తయారు చేస్తున్నారు.

అతి తక్కువ ధరకు విక్రయం

ద్రవ జీవన ఎరువులు లీటరు రూ.300 చొప్పున, పొడి జీవన ఎరువులు కిలో రూ.80కి విక్రయిస్తున్నారు. రైతులు నేరుగా ఆర్‌ఏఆర్‌ఎస్ కేంద్రంలో సంప్రదించి శాస్త్రవేత్తల సూచనల మేరకు కొనుగోలు చేసి వాడుకోవచ్చు. ఎరువుల ధర, రవాణా ఖర్చులు చెల్లిస్తే దూరప్రాంత రైతులకు కూడా కార్గో, పార్సిల్ సర్వీసుల ద్వారా జీవన ఎరువులను అందజేస్తున్నారు. తిరుపతి జీవన ఎరువుల కేంద్రంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎరువులు విక్రయిస్తుంటారు. జీవన ఎరువుల్లో రసాయన ఎరువులు కలిపి వినియోగంచరాదు. సమీప ప్రాంతంలోని మండల అగ్రికల్చరల్ ఆఫీసర్, వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తల సలహాలు తప్పని సరిగా తీసుకోవాలి.

జీవన ఎరువుల వాడకంతో ప్రయోజనాలు

- నేల పోషకలభ్యత పెరిగి మొక్కకు కావాల్సిన పోషకాలు పుష్కలంగా లభిస్తాయి.
- పంట ఆరోగ్యకరంగా ఉండడంతో పాటు దిగుబడి పెరుగుతుంది.
- ద్రవ జీవన ఎరువులకు ఏడాది కాలవ్యవధి ఉంటుంది. పొడి జీవన ఎరువులకు ఆరు నెలల మాత్రమే.
- ద్రవ జీవన ఎరువులను డ్రిప్ సిస్టమ్ ద్వారా ఉపయోగించుకోవచ్చు.
- పంట దిగుబడి సాధారణం కంటే 15 శాతం పెరుగుతుంది.
- రైతుకు గిట్టుబాటు ధర లభించేందుకు దోహదపడుతుంది.
- పంట పెట్టుబడి భారం పెద్ద ఎత్తున తగ్గుతుంది.

అధిక దిగుబడి



జీవన ఎరువులు రైతు విరివిగా వాడుకోవచ్చు. పెట్టుబడి ఖర్చు తగ్గి సాధారణం కంటే సుమారు 10 నుంచి 15శాతం ఆరోగ్యకరమైన పంట దిగుబడి పెరుగుతుంది. జీవన ఎరువులను ఆర్‌ఏఆర్‌ఎస్‌లో నామమాత్రపు ధరకు రైతులకు అందిస్తున్నాం. మంచి స్పందన వస్తోంది. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 9959254969లో సంప్రదించవచ్చు.

– డాక్టర్ ఎం.రవీంద్రారెడ్డి, సీనియర్ సైంటిస్ట్, జీవన ఎరువుల కేంద్రం, ఆర్‌ఏఆర్‌ఎస్, తిరుపతి

రైతు సంక్షేమమే ధ్యేయం



తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోంది. ఇందులో భాగంగానే జీవన ఎరువుల ఉత్పత్తి కేంద్రంలో శాస్త్రవేత్తలు సేంద్రియ ఎరువులలో ఒకటైన జీవన ఎరువులను తయారు చేసి రైతులకు అందిస్తున్నారు. రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి జీవన ఎరువుల వాడకాన్ని పెంచాలి.

– డాక్టర్ సీ.రమణ, ఏడీఆర్, ఆర్‌ఏఆర్‌ఎస్, తిరుపతి



జీవన ఎరువులను తయారుచేసే ప్రత్యేక యంత్రాలు



జీవన ఎరువులను తయారు చేస్తున్న శాస్త్రవేత్త



తిరుపతి ఆర్‌ఏఆర్‌ఎస్‌లోని జీవన ఎరువుల ఉత్పత్తి కేంద్రం

అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన అవసరం



క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపిక అందజేస్తున్న జేఈఓ సదాభార్గవి

తిరుపతి కల్చరల్: టీటీడీ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని టీటీడీ జేఈఓ సదాభార్గవి పిలుపునిచ్చారు. ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా శ్రీగోవిందరాజస్వామి ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన షార్ స్పేస్ ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం జేఈఓ మాట్లాడుతూ టీటీడీలోని 33 విద్యాసంస్థల్లో 29 వేల మంది విద్యార్థులు వివిధ రకాల విద్యను అభ్యసిస్తున్నారని, వారందరూ శ్రీహరికోటలోని షార్‌ను సందర్శించేలా చర్యలు చేపడుతామని చెప్పారు. ఈ సందర్భంగా చంద్రయాన్–3 పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఆ పోస్టర్‌ను విద్యార్థులందరూ తమ ఇళ్లల్లో అంటించుకుని స్ఫూర్తిని పొందాలని సూచించారు. టీటీడీ డీఈఓ డాక్టర్ ఎం.భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల ప్రాధాన్యతను వివరించారు. షార్ సీనియర్ సైంటిస్ట్ శంభుప్రసాద్ శ్రీహరికోటలోని పీఎస్‌ఎల్వీ, జీఎస్‌ఎల్వీ, ఎల్వీఎం–3 వంటి వాహనాల పని విధానాన్ని వివరించారు. షార్ గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణ మాట్లాడుతూ అంతరిక్ష వారోత్సవాలు శ్రీహరికోటలో మాత్రమే జరిగేవని, ఈ ఏడాది నుంచి దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్నారని తెలిపారు. షార్ టెస్ట్ ఫెసిలిటీస్ మేనేజర్ డాక్టర్ టీ.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ శ్రీహరికోటలో జరిగే ప్రయోగాలన్నింటినీ ఈ ప్రదర్శనలో ఉంచామని చెప్పారు. అనంతరం షార్ నిర్వహించిన క్విజ్ పోటీలలో ప్రతిభ కనబరిచిన 24 మంది టీటీడీ విద్యార్థులకు జేఈఓ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. అతిథులను ఘనంగా సత్కరించారు. కాగా టీటీడీ పాఠశాలల్లో 8, 9, 10 తరగతులకు చెందిన సుమారు 1,400 మంది విద్యార్థులు ఎగ్జిబిషన్‌ను తిలకించారు. హెచ్‌ఎంలు చంద్రయ్య, కృష్ణమూర్తి, సురేంద్ర, పద్మావతమ్మ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



రాకెట్ ఎగ్జిబిషన్

జగన్‌తోనే సంక్షేమం..అభివృద్ధి

- కరోనాలో కూడా ఆగని పథకాలు
- సంక్షేమం, అభివృద్ధిని ఇంటింటికీ వివరించాలి
- పార్టీశ్రేణులకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దిశా నిర్దేశం



బుక్‌లెట్లు విడుదల చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

పుంగనూరు: ఆంధ్ర రాష్ట్రానికి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఎందుకు కావాలి ... ఆయన 'సేవలు మనకు ఎంతో అవసరం' అనే నినాదంతో పార్టీశ్రేణులు ఇంటింటికీ వెళ్లి వివరించాలని మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. శనివారం తిరుపతిలో పుంగనూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' సమావేశాన్ని నిర్వహించారు. మొదటగా 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' పుస్తకాలను విడుదల చేశారు. మండలాల వారీగా ప్రజాప్రతినిధులు, నాయకులతో పార్టీ స్థితిగతులను చర్చించారు. వారి సలహాలు, సూచనలు స్వీకరించారు. మంత్రి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కరోనా కష్టకాలం ఎదురైనా ప్రజలకు అండగా నిలబడిందని తెలిపారు. దేశంలో ఎక్కడా జరగని విధంగా రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ , వలంటీర్ల మొక్కవోని దీక్షతో కరోనా రోగులకు సేవలు అందించారని కొనియాడారు. చంద్రబాబునాయుడు ఆ సమయంలో రాష్ట్రం వైపు కన్నెత్తి కూడా చూడలేదన్నారు. అలాంటి కష్టకాలంలో కూడ నవరత్నాలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. ప్రతి ఇంటికీ సంక్షేమం రూపంలో రూ.లక్షల లబ్ధి అందిందని పేర్కొన్నారు. 2014లో వందపేజీల మేనిఫెస్టోతో చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజలను మోసగించారని ఆరోపించారు. తమ ప్రభుత్వం 99శాతం మేనిఫెస్టోను అమలు చేసిందని పేర్కొన్నారు. ఈ విషయాలను ప్రతి కుటుంబం వద్దకు వెళ్లి వివరించి, చైతన్యపరచాలన్నారు. పేదరికమే ప్రామాణికంగా, కులమతాలకు, పార్టీలకు తావులేకుండ ప్రభుత్వ పథకాలను ప్రజల ముంగిటే అందించిన విషయాలను ప్రజలకు వివరించాలన్నారు. వైఎస్.జగన్‌మోహన్ రెడ్డిని రెండో సారి ముఖ్యమంత్రిగా చేసేలా మద్దతు కోరాలని తెలిపారు. ఈ సమావేశంలో టీటీడీ బోర్డు మాజీ మెంబరు పోకల అశోక్‌కుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఏకిల కార్పోరేషన్ రాష్ట్ర చైర్మన్ మురళీధర్, రాష్ట్ర జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పార్టీ విజయం కోసం పనిచేయాలి

పార్టీ పదవుల్లో ఉన్న ప్రతి ఒక్కరు వైఎస్సార్ సీపీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రజాప్రతినిధులతో కలసి పని చేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. ఈ మేరకు పార్టీ నేతలు ఆయా మండలాల్లో పర్యటించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఈసారి ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుగుతాయని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లులా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించి, ఓట్లు అడగాలని సూచించారు. కలసికట్టుగా సైనికుల్లా పనిచేయాలన్నారు. కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని స్పష్టం చేశారు.

మద్యం దొంగలు

- ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సిబ్బంది చేతివాటం
- సీసా సీల్ తీయకనే మద్యం మాయం
- డ్యామేజ్ పేరుతో తప్పుడు రిపోర్ట్
- డిమాండ్ ఉన్న మద్యం బార్లకే పరిమితం

• మద్యం దుకాణాల్లో పనిచేసే కొందరు సేల్స్‌మన్లు, సూపర్‌వైజర్లు చీప్ ట్రిక్స్‌కు పాల్పడుతున్నారు. చీప్ లిక్కర్లలో సింహ భాగం బార్లు, ఇతర వ్యక్తులకు విక్రయిస్తున్నారు. ఇలా ఒక్కో బాటిల్‌పై రూ.10 నుంచి డిమాండ్‌ను బట్టి రూ.20 వరకు అదనంగా వసూలు చేసి జేబులు నింపుకుంటున్నారు.



సాక్షి టాస్క్‌ఫోర్స్: మద్యానికి బానిసలైన వారిని నియంత్రించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కొందరు అధికారులు, సిబ్బంది నీరుగారుస్తున్నారు. డబ్బే ప్రధాన లక్ష్యంగా అక్రమాలకు తెర లేపుతున్నారు. మద్యం ప్రియులను మభ్యపెట్టి తద్వారా ఆర్థికంగా ప్రయోజనం పొందుతున్నారు. అక్రమాల భరతం పట్టాల్సిన అధికారులు కొందరు వారిని ప్రోత్సహిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడంతోపాటు.. చెడ్డపేరు తీసుకొస్తున్నారు. ఇందుకు శ్రీకాళహస్తి పరిధిలో రెండు మద్యం దుకాణాల్లో జరిగిని అవినీతి, అక్రమాలే నిదర్శనం. శ్రీకాళహస్తి విషయం వెలుగుచూడడంతో దొంగలు తేలుకుట్టిన దొంగల్లా వ్యవహరిస్తున్నారు. మరికొందరు యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతూనే ఉన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 347 ప్రభుత్వ మద్యం దుకాణాలు, 42 లైసెన్స్ బార్లు ఉన్నాయి. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే కొందరు సిబ్బంది రోజు వారీ ఆదాయానికి ఆశపడి అడ్డదారులు తొక్కుతున్నారు.

సీల్ ఉంటుంది.. మద్యం ఉండదు

మద్యం ప్రియులు దుకాణానికి వెళ్లి బాటిల్ కొనుగోలు చేయగా.. వారి ఎదురుగానే సీల్ తొలగిస్తారు. మద్యం ప్రియులు తనకెదురుగానే సీల్ తీశాడని నమ్ముతారు. అయితే బాటిల్ వేరు.. అందులో ఉన్న మద్యం వేరు. సిబ్బంది బాటిల్‌కి ఉన్న సీల్‌తో పాటు మూతను పీకేస్తారు. అందులో ఉన్న మద్యాన్ని తీసేసి.. చీప్ లిక్కర్‌ని నింపేసి యథావిధిగా మూతబిగిం చేస్తారు. మరో వైపు దుకాణాలు, గోదాములకు అట్టపెట్టెల్లో మద్యం తీసుకొచ్చి నిల్వచేస్తుంటారు. వాహనాల నుంచి తీసుకొచ్చే సమయంలో కొన్ని బాటిళ్లు పగిలిపోవడం సర్వసాధారణం. దీన్ని అవకాశం తీసుకుని కొందరు సిబ్బంది బాటిళ్లు పగలకపోయినా.. అందులోని మద్యాన్ని వేరుచేస్తారు. అదెలా అంటే.. బాటిల్ చివరన చిన్నగా పగులగొడతారు. అందులోని మద్యాన్ని తీసేసి వేరొక బాటిల్ లేదా.. ఖాళీ బాటిల్‌లో నింపుకుని వేరుగా విక్రయించి సొమ్ముచేసుకుంటారు. రికార్డుల్లో మాత్రం మద్యం బాటిళ్లు పగిలిపోయినట్లు చూపించి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు.

బ్లాక్‌లో బార్లకు

డిమాండ్ ఉన్న మద్యాన్ని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే సిబ్బంది కొందరు బార్లకు విక్రయించి సొమ్ముచేసుకుంటున్నారు. ఒక్కో బాటిల్‌పై రూ.50 నుంచి రూ.100 పెంచి విక్రయిస్తున్నారు. అదే బాటిల్‌ని బార్ల నిర్వాహకులు కొందరు రూ.200 నుంచి రూ.500 వరకు అదనంగా పెంచి విక్రయించి జేబులు నింపుకుంటున్నారు. ఇలా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే సిబ్బంది కొందరు రోజుకు 25 బాటిళ్ల నుంచి కేసుల చొప్పున బ్లాక్‌లో విక్రయిస్తున్నారు.

• ప్రభుత్వ మద్యం దుకాణాల్లోకి బ్యాలెన్‌టైన్ స్కాచ్ అందుబాటులోకి తీసుకొచ్చారు. ఫుల్ బాటిల్ ధర రూ.2,600. ఈ మద్యానికి డిమాండ్ ఉండడంతో దుకాణాల్లో పనిచేసే కొందరు బాటిల్ రూ.2,700 చొప్పున బార్ల యజమానులకు విక్రయించేస్తున్నారు. అదే మద్యం బాటిల్‌ని బార్ల నిర్వాహకులు రూ.3 వేల నుంచి రూ.3,200 చొప్పున విక్రయించి జేబులు నింపుకుంటున్నారు.

• మద్యం దుకాణం, గోదాముల్లో బ్రేకేజ్ పేరుతో కొందరు రెచ్చిపోతున్నారు. బాటిల్ సీల్ తీయ్యకుండా బాటిల్ కింద చిన్నగా పగులగొట్టి అందులోని మద్యాన్ని వేరొక సీసాలో నింపి ఆపై సొంతంగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. బాటిల్ పగిలిపోయింది, మద్యం వృథాగా పోయింది (బ్రేకేజ్ డ్యామేజ్) అని ప్రభుత్వానికి రిపోర్ట్ ఇస్తున్నారు.

• **మద్యం దుకాణాల్లో పనిచేసే సిబ్బంది కొందరు బాటిల్ సీల్ తొలగించకుండా లిక్కర్‌ని తీసేస్తారు. బాటిల్ మూతను పైకి లాగేసి అందులోని మద్యాన్ని వేరొక బాటిల్ లేదా గ్లాస్‌ల్లో నింపుకుంటారు. చీప్ మద్యాన్ని అదే బాటిల్‌లో నింపి విక్రయిస్తున్నారు.**

• బ్రాండెడ్ మద్యం వచ్చిన వెంటనే సిబ్బంది అలెర్ట్ అయిపోతారు. ఒక్కో దుకాణంలో నామమాత్రంగా ఒకటి అర కేసులు దింపి మిగిలిన మద్యాన్ని దాచిపెట్టేస్తారు. ఆపై అక్కడ పనిచేసే సిబ్బందే బార్ల యజమానులతో కుదుర్చుకున్న ముందస్తు ఒప్పందం మేరకు విక్రయిస్తారు. ఇలా ఒక్కో బాటిల్‌పై రూ.50 నుంచి రూ.100 వరకు అదనంగా వసూలు చేస్తారు. ఇలా వసూలు చేసిన మొత్తాన్ని సంబంధిత అధికారి వద్దనో.. సూపర్‌వైజర్‌కో ఇచ్చి పంపకాలు చేపడతారు.

దొంగల్ని ఏరిపారేస్తాం

సీసాల నుంచి మద్యాన్ని మాయం చేయడం, డిమాండ్ ఉన్న మద్యాన్ని బార్లకు విక్రయించడం వంటి ఫిర్యాదులు గతంలో నాకూ వచ్చాయి. ఫిర్యాదు వచ్చిన వెంటనే స్పందించి అధికారులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశాము. అందరికీ సీరియస్ వార్నింగ్ ఇచ్చాము. హెచ్చరించినా.. ఇటువంటి అక్రమాలకు పాల్పడుతున్నట్లు తేలితే ఉపేక్షించేది లేదు. దొంగల్ని ఏరిపారేస్తా. – జానకీరాం, ఎక్సైజ్ సూపరింటెండెంట్, డిపోమేనేజర్

బెల్ ఇంజినీర్ల పరిశీలన

రేణిగుంట: రేణిగుంట సీడబ్ల్యూసీ గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎం కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్ల యాక్సెప్టెన్సీ టెస్ట్ ప్రొసిజర్ ద్వారా బెల్ ఇంజినీర్లు పరిక్షించే ప్రక్రియ ప్రారంభమైనట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు.

రేపు అయోధ్యకాండ అఖండ పారాయణం

తిరుమల: లోక కల్యాణార్థం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాదనీరాజనం వేదికపై సోమవారం నాలుగో విడత అయోధ్యకాండ అఖండ పారాయణం జరుగనుంది. ఈ కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేయనుంది.

రూ.లక్ష విరాళం

పాకాల : స్థానిక ఆనందగిరి కొండపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న 54 అడుగుల సుబ్రమణ్యస్వామి విగ్రహానికి ఎన్ఆర్ఐ బయ్యారెడ్డి శ్రీనివాసులురెడ్డి రూ.1,00,116 విరాళం ఇచ్చారు. ఆయనకు ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి స్వామి వారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 72,104 మంది స్వామిని దర్శించుకోగా 25,044 మంది తలనీలాలు సమర్పించారు. స్వామికి కానుకల రూపంలో హుండీలో రూ.3.80 కోట్లు లభించాయి. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పౌరసరఫరాల సంస్థలో 708 ఉద్యోగాలు

తిరుపతి అర్బన్: ప్రభుత్వ పౌరసరఫరాల సంస్థలో 708 కాంట్రాక్ట్ ఉద్యోగాలను భర్తీ చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా మేనేజర్ వై.సుమతి తెలిపారు. వరి ధాన్యం కొనుగోలుకు సంబంధించి (ప్యాడీ ప్రొక్యూర్మెంట్) పనిచేయడానికి డీఈఓ (డేటా ఎంట్రీ ఆపరేటర్లు) పోస్టులు 236, టీఏ (టెక్నికల్ అసిస్టెంట్లు) 236 పోస్టులు, హెల్పర్స్ (సహాయకులు) 236 పోస్టులు, మొత్తంగా 708 పోస్టులను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. రెండు నెలలు పనిచేయడానికి మాత్రమే తీసుకుంటామని, ఆసక్తి ఉన్న వారు ఈనెల 31వ తేదీలోపు తిరుపతి జిల్లా వెబ్‌సైట్ tirupati.ap.gov.in లో దరఖాస్తులను డౌన్‌లోడ్ చేయాలన్నారు. ఆ తర్వాత కలెక్టరేట్ కార్యాలయంలోని బీ బ్లాక్ 4వ అంతస్తులోని 419 రూమ్‌లోని తమ కార్యాలయంలో ఇవ్వాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీలకు అండగా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ

తిరుపతి అర్బన్: ఎస్సీ,ఎస్టీలకు విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ అండగా ఉంటుందని జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (అట్రాసిటీ చట్టం -1989) సమావేశాన్ని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అన్ని మండలాల్లో సివిల్ రైట్స్ డే ప్రతినెలా నిర్వహించాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ అట్రాసిటీ కేసులకు సంబంధించి చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిటీ కన్వీనర్, ఎస్సీ సాధికార సంక్షేమశాఖ అధికారి చెన్నయ్య మాట్లాడుతూ జిల్లాలోని బీవీపురం, చింతలపాళెం, కలవగుంట భూసమస్యలతోపాటు ఎస్సీ, ఎస్టీలకు రుణాలు తదితర అంశాలపై చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

ప్లాస్టిక్ వినియోగంపై ఉక్కుపాదం

తిరుపతి తుడా : ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం తిరుపతి నగరంలోని హోల్ సేల్, రిటైల్ దుకాణాలు, హోటళ్లు, వీధి వ్యాపారుల వద్ద తనిఖీలు చేశారు. వారి వద్ద ఉన్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు, క్యారీ బ్యాగులు, నాన్ ఓవెన్ క్యారీ బ్యాగులు 130 కేజీల వరకు స్వాధీనం చేసుకున్నారు. రూ.లక్ష వరకు జరిమానా విధించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని శనివారం ఎంపీ బి.చంద్రశేఖర్, తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్ భాస్కర్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డు, ప్రసాదాలతో సత్కరించారు.

తొలిరోజు 50 మందికి అడ్మిషన్లు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పీజీ సెట్-2023లో సీట్లు సాధించిన విద్యార్థులు తొలి రోజు 50 మంది పలు కోర్సులలో అడ్మిషన్లు పొందినట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ శ్రీమురళి శనివారం తెలిపారు. ఈ నెల 10వ తేదీ వరకు ధ్రువపత్రాల తనిఖీ, అడ్మిషన్లు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు.

రేపు టీటీడీ బోర్డు సమావేశం

తిరుమల : టీటీడీ బోర్డు సమావేశం సోమవారం చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అధ్యక్షతన స్థానిక అన్నమయ్య భవన్‌లో జరగనుంది. ముఖ్యంగా ఈనెల 15 నుంచి జరగనున్న శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాలపై చర్చించనున్నారు.

భక్తి ప్రపత్తులతో పెరటాసి పూజలు



పిండి దీపాలు వెలిగిస్తున్న భక్తులు

తిరుపతి కల్చరల్: అలిపిరి పాదాల మండపం వద్ద పెరటాసి మాసం మూడో శనివారం సందర్భంగా భక్తులు అత్యంత భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. అక్కడి నుంచి గోవింద నామస్మరణ చేస్తూ తిరుమలకు కాలినడకన బయలుదేరారు. కలియుగ వైకుంఠుడైన వెంకటేశ్వరస్వామికి అత్యంత ప్రీతిపాత్రమైన, పవిత్రమైన మాసం పెరటాసి. ఈ మాసంలో వచ్చే శనివారాల్లో భక్తులు ఉపవాసంతో స్వామికి పండితలిగలు వేసి, పిండి దీపాలు వెలిగించి పూజలు చేయడం ఆనవాయితీ. మూడో శని వారం ఉదయం భక్తులు తమ కుటుంబ సభ్యులతో కలిసి అలిపిరి పాదాల మండపం వద్దకు చేరుకుని వెంకన్నను భక్తితో కొలిచారు. అలిపిరి పాదాల మండపం భక్తులతో కిక్కిరిసింది.